

39వ రోజుకు అంగన్వాడీల సమ్మె

- ఉపాధ్యాయ సంఘం మద్దతు
- ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి
- అంబేద్కర్ చిత్రపటానికి వినతి
- యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్
- కుప్పంలో అధికారుల బెదిరింపుతో అంగన్వాడి ఉద్యోగికి అస్వస్థత



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెపై అనేక బెదిరింపులకు పాల్పడినా అంగన్వాడిల సమ్మె 39వ రోజు కొనసాగుతోంది. చివరగా ప్రభుత్వం టెర్మినేషన్ పేరుతో బెదిరింపులకు దిగడాన్ని మానుకోవాలని శుక్రవారం కార్వేటినగరం లో జరిగిన సమావేశంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కేంద్రంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను తొలగిస్తామని భయబ్రాంతులకు గురిచేస్తోందని, నోటీసులకు సమాధానాలు ఇచ్చినప్పటికీ ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. స్వచ్ఛందంగా ఎవరైనా సమ్మె విరమించి విధుల్లోకి హాజరైతే తప్ప బెదిరింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఉన్నట్లుండి అంగన్వాడీ లపై ఎందుకు ప్రేమ చూపిస్తున్నారో అంగన్వాడీలు అర్థం చేసుకుంటారని తెలిపారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులతో అధికారులు జిల్లాలో కొంతమందిని భయపెట్టి బలవంతంగా విధుల్లోకి హాజరుపరుస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు.సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టు డైరెక్టర్ సిడిపిఓలను తమ గుప్పిట్లో పెట్టుకొని అంగన్వాడీల ను బెదిరింపులు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనరసమ్మ,కె.మమత నాయకులు యువరాణి,భాను, ముని యాదవ్ లతో అంగన్వాడీలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలోని అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ బైరెడ్డిపల్లి ప్రాజెక్ట్ అంగన్వాడి సిబ్బంది బైరెడ్డిపల్లి సచివాలయం వన్ ఆవరణలో 39 వ రోజు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు మద్దతుగా మండల ఉపాధ్యాయ బృందం మద్దతు తెలుపుతూ వారికి ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది అంబేద్కర్ చిత్ర పటానికి పూజలు నిర్వహించి తమ డిమాండ్లను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి ప్రాజెక్టు బైరెడ్డిపల్లి మండలం టీచర్స్ యూనియన్ యుటిఎఫ్, ఎస్‌టియు సిపి ప్రకాష్, యుటిఎఫ్ స్టేట్ లీడర్, డి వినోద్ ఎస్ టియు మండల సభ్యులు, ఎన్ శశి కుమార్ యుటిఎఫ్ జిల్లా సిపిఎస్ కన్వీనర్, నాగభూషణం యుటిఎఫ్ మాజీ.మండల ప్రధాన కార్యదర్శి, టి మోహన్ యుటిఎఫ్ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, నాగరాజు వెంకటేష్ యుటిఎఫ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఐద్వా సభ్యురాలు భువనేశ్వరి, జిల్లా వ్యవసాయ కమిటీ సభ్యులు ఓబుల్ రాజ్ పాల్గొన్నారు.

అంగన్వాడి ఉద్యోగికి అస్వస్థత

కుప్పం : కుప్పం మండల పరిధిలో అంగన్‌వాడీ ఉద్యోగి సూపర్వైజర్ల బెదిరింపుతో తీవ్ర మనోవేదనకు లోనై అస్వస్థతకు గురైనట్లు అంగన్వాడీ వర్కర్లు తెలిపారు. అస్వస్థతకు లోనైన అంగన్వాడి ఉద్యోగి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారన్నారు. ఈ



కుప్పంలో

సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ గత 39 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తామని బెదిరించిన సంగతి తెలిసిందే అన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు లొంగని అంగన్వాడి ఉద్యోగులను తమ శాఖకు చెందిన సూపర్వైజర్ల ద్వారా బెదిరింపులు చేయిస్తున్నట్లు ఆరోపించారు. ఇందులో భాగంగా కుప్పం మండల సూపర్వైజర్ల బెదిరింపులతో మనస్థాపానికి గురైన అంగన్వాడీ వర్కర్ ఆసుపత్రి పాలు కావడం బాధాకరమన్నారు. ఎవరు ఎన్ని విధాలుగా బెదిరించిన తాము అనుకున్నది సాధించేంతవరకు తమ ఆందోళన ఆపేది లేదని తేల్చి చెప్పారు.



పలమనేరులో

పలమనేరు: పలమనేరు ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద అంగన్వాడీల సమ్మె 39 వ రోజు ఉత్కంఠ భరితంగా సాగింది. ప్రభుత్వం తమసమస్యలు పరిష్క రించే దాకా సమ్మె విరమించేది ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీలు కాలేజీ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి 'రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా చేయండి..' అంటూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా, ఐఎఫ్‌టియుసి నాయకులు ఓబుల్ రాజు, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ అన్ని మండలాల నుంచి సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టి యు, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



మృతుని తండ్రి ని ఓదారుస్తున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలోని గోనుమాకుల పల్లి పంచాయతీ నాగిరెడ్డిపల్లికి చెందిన మురళి కుమారుడు నవదీప్ (11) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్యారంపల్లి గురుకుల పాఠశాలలో ఉంటూ 6వ తరగతి చదువుతున్న విద్యార్థి నవదీప్ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం ఎగ్ ఫ్రైడ్ రైస్ కావాలనడంతో వికోట నుంచి తండ్రి తీసుకు వచ్చి విద్యార్థికి ఇచ్చాడు. తింటుండ గా గుక్క పట్టేయడంతో ఊపిరి ఆడలేదని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటా హుటినా బాలున్ని కారులో వికోటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో వాంతులు చేసుకున్నాడు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు దృవీకరించారు. అల్లారు ముద్దుగా ఆటలాడుతున్న విద్యార్థి భోజనం తింటూ కుప్పకూలి మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. బాలుని తండ్రి మురళి జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులుకు అత్యంత సన్నిహితుడు కావడంతో నాగిరెడ్డిపల్లికి చేరుకున్న జడ్పీ ఛైర్మన్ బాలునికి నివాళులర్పించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



అధికారులతో కలిసి టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కమిషనర్ జె అరుణ

టిడ్కో గృహాలను నెలాఖరుకు సిద్ధం చేయండి

అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలో పూణేపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాలను ఈ నెలాఖరుకు సిద్ధం చేయాలని నగర కమిషనర్ డాక్టరు జె అరుణ టిడ్కో అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. పూణేపల్లి వద్ద టిడ్కో గృహ సముదాయాలను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. గృహ సముదాయాల్లో ఎలక్ట్రికల్, శానిటేషన్, రోడ్ల నిర్మాణం, మురికినీటి కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. పనులన్నీ ఈనెలాఖరుకు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాల న్నారు. ప్రారంభోత్స వానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. పూణేపల్లి టిడ్కో గ్రహ సముదాయంలో 300 చదరపు అడుగులు ఇళ్లు 2,256, 365 చదరపు అడుగుల గృహాలు 240, 430 చదరపు అడుగుల గృహాలు 336 మొత్తం 2,832 గృహాలను సిద్ధం చేసినట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకటముని, సీఎంఎం గోపి, టిడ్కో కన్సల్టెంట్ ధనంజయ రెడ్డి, గుత్తేదారులు పాల్గొన్నారు.



వేమనకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ షన్మోహన్

యోగి వేమన ప్రజలను మెప్పించిన తత్వవేత్త: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యోగివేమన ప్రజలను తన పద్యాలతో మెప్పించిన భారతీయ తత్వవేత్త అని కలెక్టర్ ఎస్ షన్మోహన్ కొనియాడారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశపు మందిరంలో శుక్రవారం యోగి వేమన చిత్రపటానికి కలెక్టర్ ఎస్ షన్మోహన్, డిఆర్ఓ ఎన్ రాజశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగి వేమన తెలుగు భాషలో భారతీయ తత్వవేత్త, కవి అని, ఆయన కవితలలో సరళమైన భాష, స్థానిక యాసలను ఉపయోగించడం ద్వారా ప్రసిద్ధి చెందారని 1839లో పుస్తక రూపంలో సిపి బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు తొలిసారిగా వెలుగులోకి వచ్చాయని, పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించారన్నారు. యోగి వేమన పద్యాలలోని అనేక పంక్తులు ఇప్పుడు తెలుగు భాష వ్యవహారిక పదబంధాలని తెలిపారు. యోగి వేమనకు బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాష, డిఎం సివిల్ సప్లై చంద్రబాబు, ఏ ఓ కులశేఖర్ నివాళులర్పించారు.

ద్రవిడ విశ్వవిద్యాలయంలో

ద్రవిడ విశ్వవిద్యాలయంలో వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వేమన భవనంలోని వేమన చిత్రపటం , వేమన విగ్రహానికి వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి మధు జ్యోతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కె.వేణుగోపాల్ రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ తెలుగును నాలుదిశలా చాటాలని ప్రయత్నం చేసిన వారిలో వేమనను ముందు చెప్పుకోవచ్చని, మషులకు మంచి బుద్ధిని బోధించాలని వివిధ ప్రాంతాలు తిరుగుతూ చెప్పిన మాటలు, తత్వాలు తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఏ కె వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వేమన ప్రజల మనసుకు హత్తుకునే విధంగా రచనలు సాగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు వేమన విగ్రహానికి నివాళులర్పించారు

ప్రభుత్వ స్థలం కబ్జా

- హైకోర్టులో ఫిర్యాదు..ఉత్తర్వులతో కదలిక
- కంచె ఏర్పాటు.. భూమి స్వాధీనం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక మురకంబట్టు వద్ద డికే మార్గ బైపాస్‌లో తిమ్మసముద్రం రెవెన్యూ పరిధిలోని బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న అర ఎకరం అత్యంత విలువైన వంక పోరంబోకి, గుంట ప్రభుత్వ స్థలాన్ని ఓ అధికార ప్రజాప్రతినిధి చదును చేసి కంచె వేశారు. ఈ స్థలంపై ఓ మహిళ రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరకు హైకోర్టును ఆశ్రయించడంతో స్వాధీనం చేసుకోవాలని అధికారులకు ఉత్తర్వులిచ్చింది. స్పందించిన అధికారులు శుక్రవారం ఆ స్థలంలో 'ఇది ప్రభుత్వ స్థలం' అని కంచె వేసి బోర్డు ఏర్పాటు చేశారు.

'ఆపేదెవరు.. నన్ను ఆపేదెవరు?..' అన్నట్లు అధికార వైసిపి ప్రజాప్రతినిధుల భూ కబ్జాలు జిల్లా కేంద్రమైన చిత్తూరులో రెవెన్యూ అధికారుల అండదండలతో యథేచ్ఛగా సాగిపోతున్నాయి. భూ కబ్జాలే కాదు.. మైనింగ్, ఇసుక మాఫీయాలతో చెలరేగిపో తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను సైతం కబ్జా చేస్తున్న వారికి రెవెన్యూ అధికారుల అండదండలు లభిస్తుండడం గమనార్హం.

పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తామంటున్న ప్రభుత్వం పేదోడికి సెంటు భూమి ఇచ్చేందుకు కొండలు, గుట్టలే చూపుతున్న రెవెన్యూ అధికారులు అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. చిత్తూరు ఎంఎల్ఏ భూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు ప్రతిపక్ష పార్టీ నేతలు అనేక సందర్భాల్లో ఆరోపిస్తున్నారు. టిడిపి జాతీయ కార్యాదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా చిత్తూరు ఎంఎల్ఏపై తీవ్ర ఆరోపణలు చేశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపిస్తే చాలు జెండా పాతేయడమే ఆయన పని...' అంటూ ఘాటైన విమర్శలు చేశారు. అదే నిజమన్నట్లు మురకంబట్టు వద్ద డికే మార్గ బైపాస్‌లో తిమ్మసముద్రం



కోర్టు ఆదేశాలతో కదలిన అధికారులు

రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 100, 101 లో బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న అర ఎకరం అత్యంత విలువైన వంక పోరంబోకి, గుంట ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి కంచె వేశారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధి కావడంతో స్థానికులు ప్రభుత్వ స్థలం కబ్జాను అడ్డకోలేక పోయారు. పంట కాలువ, గుంటను చదును చేసి ఆక్రమించుకున్నారు. కబ్జాకు గురైన స్థలం ఆనుకొని ఉన్న పట్టాభూమికి దారి లేకుండా చేయడంతో పాటు తమస్థలం పక్కనే ఉన్న స్థలం ఆక్రమణకు గురికావడంతో జ్యోతిరేశ్వరి కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించారు. హై కోర్టు నుండీ రెడ్‌ఫిటిషన్ వచ్చింది. రెవెన్యూ, ఇరిగేషన్, హైరోర్డు అథారిటి, ఆర్అండ్‌బి అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. విధి లేని పరిస్థితుల్లో రెవెన్యూ, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ఆక్రమణకు గురైన స్థలం వద్దకు చేరుకొని ప్రభుత్వ స్థలం అంటూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనంగా వుండాల్సి వచ్చిందో రెవెన్యూ అధికారులే చెప్పాల్సి వుంది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్నారని చిత్తూరు



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

తహశీల్దారు, ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేశాను. దాదాపు నాలుగు నెలలుగా పోరాటం చేస్తున్నాను. పట్టించుకోవడం లేదు. విధి లేని కోర్టును ఆశ్రయించాను. రోడ్డుకు సమీపంలోని విలువైన ప్రభుత్వ స్థలం దాదాపు రెండు కోట్లకు పైనే ఉంటుంది. పంట కాలువ, గుంటను పూడ్చేసి ఆక్రమించుకున్నారు. చిత్తూరు ఎంఎల్ఏ అనుచరులు జేసీబిలతో చదును చేసి కంచె ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు పట్టించుకోలేదు.

- జ్యోతిశ్వరి, స్థానికురాలు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- వి కోట : మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వి కోట గ్రామ పంచాయతీ లోని అంబేద్కర్ నగర్ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో ఆన్లైన్ , ఆఫ్ లైన్ అటెండన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. అటెండన్స్ రిజిస్టరులో సిఎల్ లను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. మూవ్ మెంట్ రిజిస్టర్‌లో



క్యాంపు వివరాలు వెంటనే నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. రాబోయే వేసవిలో ప్రజలకు తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. వైస్సార్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మితమవుతున్న గృహాల నిర్మాణాలను వేగవంతం చేసి , త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అన్ని పనులను వాలంటీర్లను సమన్వయ పరుచుకుని వారికి సత్వరం అందించాలని ఆదేశించారు. వీరితోపాటు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

అర్హులైన జర్నలిస్ట్‌లందరికీ ఇంటి పట్టాలు

- దరఖాస్తుల వెరిఫికేషన్‌ను వేగవంతం చేసి అర్హులను గుర్తించండి
- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జిల్లాలో అర్హత గల ప్రతి జర్నలిస్ట్ కు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు 3 సెంట్ ల ఇంటి పట్టాలను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరం లో జర్నలిస్ట్ లకు ఇంటి పట్టాల మంజూరు పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్. షన్మోహన్ మాట్లాడుతూ జర్నలిస్ట్ ల ఇంటి పట్టాలకు సంబంధించి కమిషనర్, సమాచార శాఖ కార్యాలయం నుండి ప్రాథమిక వెరిఫికేషన్ అనంతరం 301 దరఖాస్తులు ఆన్ లైన్ లో అందాయని తెలిపారు. ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులలో అర్హులను గుర్తించే ప్రక్రియను రెవెన్యూ శాఖ వేగవంతం చేయాలని ఆదేశించారు. జర్నలిస్ట్ ల ఇంటి పట్టా మంజూరులో దరఖాస్తుదారునికి గల సమస్యను కమిటీ దష్టికి తీసుకు వస్తే సమాచార శాఖ కమిషనర్ కు పంపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, చిత్తూరు ఆర్డిఓ చిన్నయ్య, కమిటీ సభ్యులు సహదేవ, సయ్యద్ అక్రం, కన్వీనర్, డిఐపిఆర్ఓ బి. పద్మజ, చిత్తూరు, గుడిపాల తహశీల్దార్లు మురళిమోహన్, బాబు రాజేంద్ర ప్రసాద్, చిత్తూరు ప్రెస్ క్లబ్ సెక్రెటరీ అశోక్ కుమార్, పాత్రికేయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.


'ఓటర్ల సవరణ'పై రాష్ట్ర ఎన్నికల అధికారి సమీక్ష

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : 2024 ఎన్నికల సంబంధించి 'ఓటర్ల సవరణ' కార్యక్రమ నిర్వహణపై, ఇతర ఎన్నికల అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్‌వోలతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. చిత్తూరు కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్, డిఆర్ఓ యన్ రాజశేఖర్, ఎలక్షన్ సెక్షన్ సిబ్బంది ఉమాపతి, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ సహకారం

- వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింతగా లాభసాటిగా చేసేందుకు క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో వివిధ శాఖలకు చెందిన వారిని ఉద్యోగులుగా నియమించి సలహాలు, సూచనలను ఇప్పిస్తామని తద్వారా నాణ్యమైన ఉత్పత్తులు పొందేందుకు వీలు ఉంటుందని, రైతులకు కార్యాలయాలు చుట్టూ తిరిగే పని లేకుండా చేశామని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 29 మండలాల్లో మామిడి ప్రధాన పంటగా ఉంటుందని,ఇప్పటికే రానున్న మామిడి సీజన్ కు సంబంధించి ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన సమావేశాలను నిర్వహించామని మంచి ఉత్పత్తులు సాధించి తద్వారా ఎగుమతులు చేసి మంచి ధరలు పొందేలా అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా సాధిస్తున్న పంటలకు ఇప్పటికే మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని, దీనిని మరింతగా విస్తృత పరిచేలా ప్రభుత్వాన్ని కోరామన్నారు. జేసి పి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక పద్ధతి ప్రకారం ఉత్పత్తులు సాధించేందుకు కష్టపడాలని అదేవిధంగా గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు అధికారుల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులను పాటించడం తోపాటు కోత దశలో మరింత జాగ్రత్తగా తీసుకోవాలని అన్నారు. జిల్లాలో రాగి పంటకు మరింత అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకొని మంచి ఉత్పత్తులు సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ఆదర్శ రైతుల సలహాలను కూడా రైతులకు చెప్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలదికారులను ఆదేశించారు. అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడేందుకు మరింతగా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. పిఎంకె ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ ప్రభాకర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏడి మార్కెటింగ్ పరమేశ్వర్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారిని శోభారాణి, మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటరమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ ఈ విజయ్ కుమార్ రెడ్డి, డ్వామా ఏపిడి ఉమాదేవి, శాస్త్రవేత్త రెడ్డి రాము సభ్యులు రత్నారెడ్డి, శివ ప్రకాష్ రాజు, జగదీశ్వర్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ రామచంద్రారెడ్డి

అంబేద్కర్ కృషి మరువలేనిది: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించడంలో బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి మరువలేమని జిల్లా కలెక్టర్ ఎస్ షన్మోహన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆవిష్కరణను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి విగ్రహావిష్కరణ చేసిన సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వర్చువల్ విధానం లో కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పందన హల్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎంకె ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, బి సి సంక్షేమ శాఖ డిడి రబ్బానీ బాష, వివిధ శాఖల సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

మార్కెట్లు, ప్రధాన కూడళ్లు పరిశుభ్రంగా ఉండాలి

పారిశుధ్య అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరంలో కూరగాయల మార్కెట్లు, కూడళ్లు, ప్రధాన ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ డాక్టరు జె అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్లో శానిటేషన్ పనులను శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణ దారులతో మాట్లాడుతూ కూరగాయల వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకూడదని, పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలన్నారు. మార్కెట్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను రోజూ తొలగించి శుభ్రం చేయించాలన్నారు. ట్రాఫిక్, ప్రజా రవాణాకు అడ్డంకి లేకుండా దుకాణాలను లోపలవైపు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రధాన కూడళ్లలో, రహదారులు ఉదయమే స్వీపింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

'కుల గణన' సర్వేని వేగవంతం చేయండి: ఎంపీడీవో

ప్రజాశక్తి -సోమల: మండలంలో ప్రారంభమైన 'కుల గణన' సర్వేను వేగవంతంగా పూర్తి చేసి ఈనెల 28 లోపు నివేదికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో నాగరాజు కోరారు. శుక్రవారం మండలంలోని ఇరికిపెంట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మేనక, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న కుల గణన సర్వేని పరిశీలించారు. ప్రతి కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి కులగణన సర్వే నిర్వహించాలని పారదర్శకంగా చేయాలని కోరారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఈఓఆర్‌డి

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఈఓఆర్డి లక్ష్మీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో వీధి దీపాలు ఏర్పాటు, పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పంచాయతీని ఆరోగ్యవంతమైన పంచాయతీగా నెలకొల్పాలన్న ఉద్దేశంతో సచివాలయ సిబ్బందికి సలహాలు సూచనలు అందించామని మండలంలోని అన్ని పంచాయతీలలోనూ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు పూర్తి స్థాయిలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని తెలిపారు. సచివాలయానికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమైన ఆహారం తీసుకోవాలి

అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని అడిషనల్ డిఎంహెచ్‌వో వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చికురు పల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షను సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని, అనారోగ్యం ఏర్పడినప్పుడు వైద్యుల సలహాలు మేరకు మందులు వాడాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రతి మూడు మాసాలకు ఒకసారి ప్రజల వద్దకు జగనన్న ఆరోగ్య సురక్షను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు లోహిత్ చంగల్ రాయలు, శిరీష, రమ్య డిపిఎంఒ మని వైద్య సిబ్బంది రమేష్, రమాదేవి, అనూష, రవళి, నీరజ, దివ్య గ్రామస్తులు చంద్రారెడ్డి, మునిరెడ్డి పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలం కడపనత్తం గ్రామపంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష–ఫేస్ 2 కార్యక్రమానికి ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ మొగసాల రెడ్డప్ప మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు బేలుపల్లి సర్పంచ్ వెంకటేష్, ఎం కొత్తూరు ఎంపీటీసీ వినాయకం, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, అనారోగ్యులు, గ్రామస్తులు, మండల అధికారులు పాల్గొన్నారు.

రామకుప్పం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పూజిత ,సర్పంచ్ నేత్ర నాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆదినాయుని పల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 386 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి కంటి అద్దాలు అవసరమైన వారికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రణీత, శ్వేత, నోడల్ అధికారి హరినాథ్, వైద్య సిబ్బంది బాలు, పుష్ప, గ్రామస్తులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరులో యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించి, ఆయన సేవలను పలువురు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, ఏ వాసు, పలమనేరు శాసన సభ్యులు ఎన్.వెంకటే గౌడ, ఏ.ఎం.సి.ఛైర్మెన్ హేమంత్ కుమార్ రెడ్డి , మునిసిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి సుధాకర్ పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యోగి వేమారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలమనేరు పట్టణ సమీపంలోని నాగ మంగళం వద్దనున్న యోగి వేమారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు, కవులు మల్లెల నాగరాజు, చంద్రశేఖరయ్య, ప్రసన్నలక్ష్మి, జయలక్ష్మిలను సత్కరించారు. ఈ కార్యక్రమాలలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అమర్నాథరెడ్డి, వెంకటరమణారెడ్డి, కిషోర్, రంగనాథ్, జయ రామిరెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి,నాగరాజు రెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

తప్పిదాలకు తావులేకుండా కులగణన సర్వే : కమిషనర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : కుల గణన సర్వే పకడ్బందీగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని కమిషనర్ డాక్టరు జె అరుణ ఆదేశించారు. కుల గణన సర్వే తీరును సత్యనారాయణపురం, వెంకటేశ్వర కాలనీ పరిధిలో కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. వాలంటీర్ యాప్ లో కుల గణన సర్వేకు సంబంధించిన వివరాల నమోదు అంశాన్ని తనిఖీ చేశారు. 'ఇంటింటి సర్వే ఏ విధంగా చేస్తున్నారు?'అని వాలంటీర్లు, వార్డు కార్యదర్శులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..క్లస్టర్ వారీగా మ్యాపింగ్ చేసిన వాలంటీర్లు, వార్డు కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే సందర్భం గా ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని, యాప్‌లో నిర్దేశించిన మేర సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని, ఇందుకోసం క్లస్టర్ వారీగా వాలంటీర్లు రోజువారి నిర్దేశించిన గృహాల సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



కులగణన సర్వే నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

పుంగనూరులో 'సినీ సంక్రాంతి సందడి'

- విజేతలకు బహుమతుల ప్రదానం
- సందడి చేసిన తమన్నా, సింగర్ సునీత, యాంకర్ సుమ

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరులో ప్రముఖ సినీ నటి తమన్నా, యాంకర్ సుమ, నేపథ్య గాయని సునీత తదితరులు సందడి చేశారు. భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధినేత బొడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పుంగనూరు నియోజకవర్గ వ్యాప్తంగా ముగ్గుల పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. విజేతలకు ప్రముఖ సినీ నటి తమన్నా, సింగన్ సునీత, యాంకర్ సుమ చేతుల మీదుగా బహుమతులు, కానుకలు అందించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకునే పండుగ సంక్రాంతి, ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని తమన్నా అన్నారు. వచ్చే ఏడాది కూడా ఇక్కడి సంక్రాంతి వేడుకలో తప్పక పాల్గొంటానని తెలిపారు.

వచ్చే ఏడాది భారీ నిర్వహణ: ఆర్‌సీవై

ఈ సందర్భంగా బొడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది సంక్రాంతి సంబరాలను రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భారీ ఎత్తున పుంగనూరులో నిర్వహిస్తామని తెలిపారు. తాము ఇచ్చిన చిన్న పిలుపునకు నియోజకవర్గంలోని వందలాది మంది ఆడపడుచులు స్పందించి ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగు నివ్వాలని ఆకాంక్షించారు . ముఖ్యంగా



బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సినీ తారలు

సంక్రాంతి రైతుల పండుగ అని, సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మంచి పంట పండాలని, మహిళందరికీ సౌభాగ్యం అందించాలన్నారు. సంక్రాంతికి పుంగనూరులో ఒక ప్రత్యేకత ఉందన్నారు. సంక్రాంతి రోజు నుండి నెల రోజుల పాటు ఇక్కడి గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమాన్ని ఇంకా భారీ ఎత్తున నిర్వహించాలని భావించినప్పటికీ పుంగనూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ముగ్గుల పోటీలు మాత్రమే నిర్వహించామన్నారు.మహిళలకు ముగ్గుల పోటీలు, రైతులకు ఎద్దుల పోటీలు, యువతకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు, కానుకలు

మొదటి బహుమతిగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 50,116లు చొప్పున బహుమతి అందజేశారు. పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో మొదటి బహుమతి వసంత కుమారి, రూరల్ మండలం నుండి జే లోహిత, చౌడేపల్లి మండలం నుండి ఆర్ కుసుమ, సోమల మండలం నుండి బి చిన్న రెడ్డమ్మ, సదుము మండలం నుండి డిఅనసూయ, పులిచర్ల మండలం నుండి ఎం హేమలత, రొంపిచర్ల మండలం నుండి జి రెడ్డి రేణుకకు మొదటి బహుమతి అందజేశారు. ఆ తర్వాత ద్వీతయ బహుమతి మండలానికి ముగ్గురు చొప్పున మొత్తం 21 మందికి రూ. 25,116లు చొప్పున, తృతీయ బహుమతి మండలానికి 9 చొప్పున మొత్తం 63 మందికి రూ.5,116లు చొప్పున నగదు బహుమతి అందజేశారు. అలానే పోటీలో పాల్గొన్న ప్రతి ఆడపడుచుకూ సంక్రాంతి ప్రత్యేక కానుకలు అందించారు.

పారదర్శకంగా నిర్వహణ

ఈ పోటీలను రామచంద్ర యాదవ్ వినూత్నంగా నిర్వహించారు. భోగి రోజు (ఈ నెల 14న) న మహిళలు వాళ్ల ఇంటి ముంగిట ఆకర్షణీయ ముగ్గు వేసి, ముగ్గుతో సెల్ఫీ దిగి, ఆ సెల్ఫీ వారి ఐడెంటిటీ కార్డుని మండలాల వారీగా ఇచ్చిన ఫోన్ నెంబర్ లకు వాట్సప్ ద్వారా పంపగా, విజేతలను ఎంపిక చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎంపిపి

ప్రజాశక్తి - కార్వేటినగరం: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ లత బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని శివాలయం వీధి, టీవీఎం వీధిలో రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందని పేర్కొన్నారు. డ్రైనేజీలు ఏర్పాటులో కూడా కార్వేటినగరం మండలం మొదటి స్థానంలో ఉందని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో అభివృద్ధి పనులు పరుగులు తీస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడంలో మీనమేషాలు లెక్కించాయని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతో పాటు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరో సారి ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మాజీ ఎంపీటీసీ మురగయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి లత బాలాజీ

రెడ్డప్ప, నారాయణస్వామిని కొనసాగించాలి

- లేదంటే రాజీనామాకు సిద్ధం
- వెదురుకుప్పం వైసిపి నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి -వెదురుకుప్పం: డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎమ్మెల్యే సీటును కేటాయించాలని, ఎంపి సీటును రెడ్డప్పకే కేటాయించాలని లేదంటే తామంతా రాజీనామా చేస్తామని మండల జెడ్పీటీసీ, ఎంపిపి, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, రాష్ట్ర వైసిపి డైరెక్టర్లు, నాయకులు కార్యకర్తలు జగన్ అభిమానులు హెచ్చరించారు. ఈ మేరకు వారు రెడ్డప్ప, నారాయణస్వామిని అభ్యర్థులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. వెదురుకుప్పంలో వారు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణస్వామి తోనే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఆరు మండలాల్లోనే ప్రతి ఒక్కరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని మరోసారి ఇక్కడ ఎమ్మెల్యేగా నారాయణస్వామిని, చిత్తూరు ఎంపీగా రెడ్డప్పని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం స్థానిక నాయకుల మాటలను గౌరవించి గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా నారాయణస్వామికి పేరును ప్రకటిం చాలన్నారు. లేనిపక్షంలో నారాయణస్వామి దయతో పదవులు పొందిన తామందరూ రాజీనామాకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ నారాయణస్వామికే మూడోసారి టికెట్ ఇవ్వాలని మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్ర రెడ్డి, రాష్ట్ర గ్రీన్‌అండ్ బ్యూటిషన్ డైరెక్టర్ గుణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డిలు విన్నవించారు. గంగాధర నెల్లూరులో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానికేతరులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా ప్రజలకు అందుబాటులో ఉండే నారాయణస్వామికే కేటాయించాలని సీఎం జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చిన్నమరెడ్డి, మునిరాజారెడ్డి, హరిబాబు, వేలుమొదలి, సుధాకర్ నాయుడు, వెంకటేష్ రెడ్డి, అములునాధన్, కుట్టి, కేశవులు, లారెన్స్, పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు



భరత్ సతీమణి దుర్గకు ఆహ్వానం పలుకుతున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి..

భరత్ సతీమణి అభ్యర్థన

ప్రజాశక్తి -రామకుప్పం: కుప్పం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను ఆశీర్వదించాలని ఆయన సతీమణి దుర్గ కోరారు. మండల పరిధిలోని ఉన్సిగాని పల్లి గ్రామ పంచాయతీలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చంద్రమౌళి ప్రజలకు ఎంతో సేవలందించారని ఆయన తనయుడు భరత్ కూడా ప్రజల పక్షాన నిలబడి గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తు న్నార న్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నవరత్నా లతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి నిరుపేదల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. కుప్పం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో భరత్‌ను కుప్పం ఎమ్మెల్యే గా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బాబు రెడ్డి, సర్పంచ్ నేత్రావతి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మన్ లలితా మురుగేశ్, ఎంపిటిసి గుర్రప్ప పాల్గొన్నారు.

'జగనన్న విద్యా కానుక'పై ఎంఈఓ సమీక్ష

ప్రజాశక్తి-సోమల: 'జగనన్న విద్యా కానుక'పై ఎంఈవో శివరత్నమ్మ మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 39 పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని ఇందుకోసం ఆయా కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు రెండు రోజులు సమయం తీసుకుని పూర్తి చేయాలని ఇందుకోసం ఎస్ఎంఎఫ్ నిధులను కేటాయించామని తెలిపారు. జగనన్న విద్యా కానుక, యుడైజ్ ప్లస్ అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు.

నేడు పాక్షిక విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరులో మూడో శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పలమనేరు టౌన్, రూరల్ ప్రాంతం లో విద్యుత్ సరఫరా ఆపివేయనున్నారు. ప్రజలు సాకరించాలని పలమనేరు విద్యుత్ శాఖ డీఈఈ చిన్నప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలను సిఎం కొనసాగిస్తున్నారు: ఎంపిపి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అంబేద్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని ఎంపిపి రెడ్డెప్ప పేర్కొన్నారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్స వానికి ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి శుక్రవారం తరలి వెళ్లారు. ముఖ్యమంత్రి జగన్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ తరువాత ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడంతో పాటు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ కు దక్కు తుందన్నారు. అభివృద్ధి లేదని చెబుతున్న ప్రతిపక్షాలు గ్రామాల్లో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలను చూడాలన్నారు. వాటి ద్వారా రైతులకు, వికలాంగులకు, వృద్ధులకు, అర్హులైన ప్రతి వ్యక్తికి వాలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి జగన్ నెర వేరుస్తున్నారని, ముఖ్యంగా నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చామని ఆంధ్ర రాష్ట్ర హ్యూమన్ రైట్స్ సెల్ అధ్యక్షులు ఆంజప్ప అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జై భీమ్ యువజన సంఘం అధ్యక్షులు అమర నారాయణ, ప్రభాకర్, బాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పించాలి: డిఇ

ప్రజాశక్తి -సోమల: మండలంలోని 39 పోలింగ్ బూత్‌లలో వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలని పంచాయతీరాజ్ డిఇ లక్ష్మీప్రసాద్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు గదిలో ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 39 బౌలింగ్ కేంద్రాలలో విద్యుత్ టాయిలెట్లు, తాగునీరు, ర్యాంపుల నిర్మాణం తదితర వసతుల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని, మరమ్మతులు చేయడం కోసం 'నాడు నేడు' నిధులను వాడుకోవచ్చునని కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని వెంటనే తగిన సౌకర్యాలు లేని పోలింగ్ కేంద్రాలలో వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఈ ఓ డి లక్ష్మీదేవి, ఎం ఈ ఓ శివరత్నమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డిఇ లక్ష్మీప్రసాద్

దొంగ ఓటర్లకు మంత్రి అండ..

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున అధికార పార్టీ దొంగ ఓట్లను చేర్పించిందంటూ కలెక్టరేట్ ఎదుట తెలుగుదేశం, జనసేన శుక్రవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దొరబాబు, పులివర్తి నాని, జీడి నెల్లూరు ఇన్‌చార్జి థామస్, కఠారి హేమలత, పూతలపట్టు ఇన్‌చార్జి మురళిలు మాట్లాడుతూ ఓటమి భయంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అధికార పార్టీ ఎంఎల్‌ఏలు పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లను నమోదు చేశారన్నారు. తిరుపతిలో 30 వేల దొంగ ఓట్ల నమోదులో ఐఎఎస్ అధికారిపై వేటుపడ్డ విషయాన్ని గుర్తు చేస్తూ ఇదే తరహాలో జిల్లాలో కొందరు అధికారులు అధికార పార్టీకి అండగా నిలుస్తున్నారని ఇలాంటి వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో లక్షకు పైగా దొంగ ఓటర్లనున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజవర్గంలో ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెద్ద ఎత్తున దొంగ ఓటర్లను ప్రోత్సహించారని, తిరుపతి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన గురుమూర్తి ఎన్నిక చెల్లదని 30 వేల దొంగ ఓట్లతో గురుమూర్తి విజయం సాధించాన్నారు. చిత్తూరులో ఎర్ర చందనం స్మగ్లర్ విజయానందరెడ్డి గూండాలా ప్రవర్తిస్తూ దొంగ ఓట్ల నమోదు చేయించారని దొంగ ఓట్లను తొలగించేలా న్యాయ పోరాటాని సాగిస్తామన్నారు. అధికార పార్టీపై ప్రజా వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ విరుద్ధంగా దొంగ ఓట్లతో విజయం సాధించాలని అధికార పార్టీ నేతలు ప్రయత్నస్తున్నట్లు తెలిపారు. ధర్నా అనతరం కలెక్టర్‌కు వినతి చేశారు. ఈ కార్యక్రమంలో జిజేఎం ట్రస్ట్ ప్రతినిధి సీనియర్ టిడిపి నాయకులు గురుజల చెన్నకేశవ నాయుడు, టిడిపి నాయకులు కోదండయాదవ్, మోహన్‌రాజ్‌లతో పాటు జనసేన నాయకులు కవిత, లోచన్ శ్రీరామ్‌లతో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట టిడిపి, జనసేన ధర్నా



ధర్నా చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టీచర్ యువకుడు మృతి మరో యువకుడికి గాయాలు అయిన సంఘటన శుక్రవారం మండలంలోని మొగిలి ఘాట్లో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప ఇచ్చిన సమాచారం ప్రకారం బైరెడ్డిపల్లి మండలం మేకల నాగిరెడ్డి పల్లి చింతల కుప్ప గ్రామానికి చెందిన కార్తిక్ కుమారుడు శివ స్నేహితుడు అక్రమ్ ఇరువురు బంగారుపాలెం నుండి బైరెడ్డిపల్లి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పలమనేర్ నుండి శ్రీ ని ఫుడ్ వెళుతున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో శివకు గాయాలు కాగా వారిని ప్రథమ చికిత్స బంగారు పాళ్యం మెరుగైన చికిత్స కోసం చిత్తూరుకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా శివ (18) చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్రమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన వసతుల కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలని ఏఈఆర్వో, కమిషనర్ డాక్టరు జె అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై శుక్రవారం మధ్యాహ్నం సెక్టోరియల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నిర్దేశించిన వసతులపై సమగ్ర నివేదికలను అందించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు అందించిన నివేదికల ఆధారంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నిచర్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలను సత్వరం సమర్పించాలని వార్డు అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఈ గోమతి, డీఈలు, ఏఈలు, సెక్టోరియల్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలో మామిడి సాగు చేస్తున్న రైతులకు జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారని వ్యవసాయ అధికారి అమృత తెలిపారు. మామిడి పంటలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందించారు. తెగుళ్ల, చీడపీడల సస్య రక్షణ చర్యలు జాగ్రత్తలపై శిక్షణ ఇవ్వడానికి తిరుపతి శాస్త్రవేత్తలు రానున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల శివార్లలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన 'ఆడుదాం..ఆంధ్రా' క్రీడ పోటీల్లో గెలుపొందిన వారికి అధికారులు, ప్రజా ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కెంచనబల్ల క్రికెట్ టీం, అయ్యప్ప గాని పల్లి కబడ్డీ టీం, మణింద్రం వాలీబాల్ టిం, రామకుప్పం బ్యాట్మెంటన్ టిం, అయ్యప్ప గానిపల్లి కోకో టీముల్లో గెలుపొందిన వారికి క్రీడా సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం ,మండల అధ్యక్షుడు బాబు రెడ్డి, నేతలు మురుగేష్, కేశవరెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణ, క్రీడా సభ్యులు పాల్గొన్నారు.

మండలాని ఒక వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తా..

- నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: నియోజకవర్గంలోని ప్రతి మండలంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయిస్తానని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్ అన్నారు. గంగాధర నెల్లూరు మండల పరిధిలోని ముక్కళత్తూరు పంచాయతీలో 'భవిష్యత్ గ్యారెంటీ – బాబు ష్యూరిటీ' స్ఫూర్తిగా మన ఇంటికి మన థామస్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ థామస్ కు, టిడిపి నేతలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ థామస్ ప్రతి ఇంటికి వెళ్లి సంక్రాంతి కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, వెంకటేష్ , స్వామి దాస్, దేవసుందరం, నియాజ్ ఆలీ, జాన్, రమేష్ , ప్రభాకర్ నాయుడు, హైదర్ ఆలీ , చెంగల్రాయ నాయుడు, ఢిల్లీ నాయుడు , చిన్న, నీరజాక్షులురెడ్డి రెడ్డి , జ్యోతి యాదవ్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -నగరి : మూడు దశాబ్దాల క్రితం నగరిలో నిర్వహించిన విజ్ఞాన్ ట్యుటోరియల్‌లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు, వారికప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు నగరి పట్టణం లో అలుమిని ఫంక్షన్ నిర్వహించి కలుసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. చదువుకున్న విద్యార్థు లందరూ ఉపాధ్యాయులుగాను, ఉద్యోగులుగాను స్థిరపడి తల్లిదండ్రు లయ్యారు. ట్యుటోరియల్‌లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు అధ్యాపకులుగా, ఎంఈవోలుగా, ప్రిన్సిపాళ్లుగా విధులు నిర్వహించగా కొందరు విరమణ కూడా పొందారు. ఉపాధ్యాయులందరూ వెళ్లిపోవడంతో రెండు దశాబ్దాల క్రితమే ట్యుటోరియల్ కూడా మూతబడింది. అయితే అప్పుడు చదివిన విద్యార్థుల్లో ఏర్పడిన స్నేహ బంధం, గురువులపై ఉన్న గౌరవం మూడు దశాబ్దాల అనంతరం కలిసేలా చేసింది. అందరినీ ఒక్కటి చేయడంలో సామాజిక మాధ్యమం తనవంతు పాత్ర పోషించింది. దీంతో టీఆర్ కండ్రిగలోని విశ్రాంత గురువు ఇంటి ఆవరణలో అందరూ కలుసుకున్నారు. తమ జీవిత పుస్తకంలో చెక్కుచెదరని పేజీలను మళ్లీ తిరగేశారు. కాలయంత్రంలో వెళ్లినట్లు అందరూ మూడు దశాబ్దా లు వెనక్కు వెళ్లిపోయారు. అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనందపు క్షణాలను మళ్లీ ఆస్వాదిం చారు. జీవితాల్లో జరిగిన మార్పులపై మనసు విప్పి చర్చించు కున్నారు. ఈ అపూర్వ కలయిక ఆనందానికి నిలయమైంది. సమావేశం ముగింపులో గురువులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఇలా ప్రతి ఏడాది సంక్రాంతి ముగింపులో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

వివిధ అభివృద్ధి పనులకు రూ.3 లక్షలు వితరణ

ప్రజాశక్తి- కార్వేటినగరం: పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఆకుల మునిలక్ష్మమ్మ జ్ఞాపకార్థం రూ. 3లక్షలు వితరణ చేసినట్లు మునిలక్ష్మమ్మ కుమారుడు ప్రముఖ సినీ డైరెక్టర్ ఆకుల శివ తెలిపారు. సీడీ కండ్రిగ పంచాయతీ పరిధిలోని వడ్డిండ్ల గ్రామంలో వెలసిన మొగిలమ్మ ఆలయ అభివృద్ధికి శుక్రవారం రూ.20 వేలును ఆ గ్రామస్తులను అందించారు. ఈ సందర్భంగా సినీ డైరెక్టర్ ఆకుల శివ మాట్లాడుతూ తమ తండ్రి ఆకుల సుబ్రమణ్యం సర్పంచుగా పంచాయతీ అభివృద్ధికి 30 సంవత్సరాలు సేవలు అందించారని గుర్తు చేశారు. అదే బాటలో తమ కుటుంబం నేటికీ రాజకీయం అధికార పార్టీ వైసిపి ప్రభుత్వం తరఫున ఎనలేని సేవలు అందిస్తున్నారని తెలిపారు. సినీ పరిశ్రమ ద్వారా ఆర్థికంగా ఎదిగన తాను టీకేఎం పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, టీకేఎం పేట గ్రామంలో వెలసిన పెద్దపులిగంగమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయాల అభివృద్ధికి ఇప్పటి వరకు సుమారు రూ.3 లక్షలు నగదును అందించినట్లు పేర్కొన్నారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఆకుల మునిలక్ష్మమ్మ కుటుంబం గ్రామాభివృద్ధికి ఆర్థిక సాయం అందించడంలో ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, సర్పంచ్ ఆకుల మంగమ్మ, ఆకుల రాజగోపాల్,ఆకుల చంద్రశేఖర్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు విరాళం అందిస్తున్న దాత